క్లుప్తంగా

స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్న పత్రాలు


ప్రశ్నపత్రాలను స్టేషన్‌కు చేర్చుతున్న అధికారులు

సోమశిల: ఈ నెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రశ్నపత్రాలు ఆదివారం అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. పోలీస్ స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూంలో ప్రశ్నపత్రాలను అధికారులు భద్ర పరిచారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష


సంగం గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష కేంద్రం వద్ద కోలాహలం

సంగం: గురుకుల పాఠశాలలో ఆదివారం 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు జరిగాయి. ఉదయం 5వ తరగతి ప్రవేశ పరీక్ష జరగ్గా, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష జరిగింది. దూరప్రాంతాల నుంచి విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 162 మంది హాజరు కాగా, ఇంటర్మీడియట్ ప్రవేశానికి 246 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ సుమతి తెలిపారు. పరీక్ష కేంద్రానికి చుట్టూ 144 సెక్షన్ విధించి బందోబస్తు నిర్వహించారు

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో చేరడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ప్రారంభం కాగా , మధ్యాహ్నం నుంచి ఇంటర్ ప్రవేశ పరీక్ష జరిగింది. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 198 మంది హాజరు కాగా, ఐదో తరగతి చేరేందుకు ప్రవేశ పరీక్షలు 203 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ శైలజ, వైస్ ప్రిన్సిపల్ నాగలలిత తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా సమన్వయ కర్త హేమలత తనిఖీ చేశారు.

వసతిగృహాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య

సోమశిల: అనంతసాగరం మండలంలోని రేవూరు, అనంతసాగరం గ్రామాల్లోని బీసీ బాలికలు, బాలుర వసతి గృహాలను జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వసతి గృహాల్లో వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఏబీసీడబ్ల్యూఓ శ్రీదేవి, హాస్టల్ వార్డెన్ మల్లేశ్వరి ఉన్నారు.

భీమేశ్వరస్వామి గ్రామోత్సవం


కామాక్షిదేవి సమేత భీమేశ్వరుడి గ్రామోత్సవం

సంగం: మండలంలోని వంగల్లులో కొలువైన కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను శేష వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఏకాంత సేవ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడిన బత్తల సుబ్బయ్య, రూపాంత్

సంగం: ముందు వెళ్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని దువ్వూరు మత్స్యకారుల ఇళ్ల సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు గ్రామానికి చెందిన బత్తల సుబ్బయ్య, రూపాంత్ వరికోత మెషిన్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. అన్నారెడ్డిపాళెంలో వరికోత పనులు చేస్తున్న వీరు ఆయిల్ కోసం దువ్వూరు పెట్రోల్ బంకు వరకు బైక్‌లో వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన వీరిని స్థానికులు 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కావ్య కవ్వింపు రాజకీయం

- ప్రచారంలో వ్యక్తిగత దూషణలు, అహంకార వ్యాఖ్యలపై క్యాడర్ అసహనం
- కావలి తమ్ముళ్లు తలోదారి
- ఒక్కొక్కరుగా కీలక నేతలు పార్టీకి దూరం
- ప్రజల్లోనూ తీవ్ర వ్యతిరేకత



కావలి: కావలిలో తెలుగుదేశం పార్టీ రోజు రోజుకు పాతాళంలోకి కూరుకుపోతోంది. ఆ పార్టీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అలియాస్ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి వైఖరిపై తెలుగు తమ్ముళ్లు అసహనంతో రగిలిపోతున్నారు. అసలే టీడీపీ గ్రాఫ్ నేలబారిన క్రమంలో ఆ పార్టీలోని క్రియాశీలక నేతలు ఉనికిని కాపాడుతూ వస్తున్నారు. ఈ దశలో పార్టీ అభ్యర్థిగా వచ్చిన కావ్య ధనబలంతో స్థానిక క్యాడర్‌ను కాదని తన సొంత ప్రాంతం పక్క మండలం నుంచి రౌడీమూకలతో ప్రచారం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీకి గెలుపు అవకాశాలు కనుచూపు మేరలో కనిపించకపోవడం, తన ప్రచారానికి ప్రజాదరణ లేకపోవడంతో కావ్య కవ్వింపు చర్యలకు పాల్పడుతూ.. అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని పార్టీ వీర విధేయులు, కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీకి దూరమవుతున్నారు. ఎవరి దారి వాళ్లు చేసుకుంటున్నారు.

అద్దె జనంతో హడావుడి

మైనింగ్ మాఫియాగా ఎదిగిన కావ్య కృష్ణారెడ్డి కేవలం డబ్బు మూటల బలంతోనే కావలి టీడీపీ టికెట్ దక్కించుకున్న విషయం జగద్విదితమే. అయితే కావ్యకు కావలి పార్టీ కేడర్‌పై నమ్మకుండా తన సొంత మండలం జలదంకి నుంచి రౌడీమూకలు, తన వద్ద పని చేస్తే వలస కూలీలతో హడావుడి చేస్తున్నాడు. నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులతో ర్యాలీలు, ప్రదర్శనలు చేయిస్తూ ఉనికి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఉత్తుత్తి చేర్పులు, కండువాల మార్పులతో జనాల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తున్నాడు. కేవలం డబ్బు, రౌడీయిజాన్నే నమ్ముకుని రాజకీయం చేయాలనుకుంటున్న కావ్య వైఖరిని ముందుగానే పసిగట్టిన ఎన్టీఆర్ అభిమానులు, అసలైన కార్యకర్తలు కావ్యకు టికెట్ కేటాయించిన రోజు నుంచే పార్టీకి దూరంగా ఉంటున్నారు.స్థానికంగా పార్టీ క్యాడర్‌ను లెక్క చేయకుండా నోటిదురుసు మాటలు మాట్లాడుతుండడంతో కార్యకర్తలు అసహనంతో భగ్గుమంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మొక్కుబడిగా కార్యక్రమాలకు హాజరవుతున్న కొందరు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు నచ్చక వరుసగా పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నారు. 40 ఏళ్ల నుంచి టీడీపీ వీరాభిమానులుగా ఉన్న వారు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే కావలిలో టీడీపీ శిబిరం 70 శాతం ఖాళీ అయింది. అయితే గెలుపు సంగతి అటుంచి డిపాజిట్ కూడా దక్కదని టీడీపీ క్యాడర్ బహిరంగంగానే చెబుతున్నారు.

మీడియాపై అక్కసు

టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి సహా ఆయన ముఖ్య అనుచరగణం మీడియాపై దారుణమైన రీతిలో అక్కసు వెళ్లగక్కుతున్నారు. మీడియా ప్రతినిధులతో పాటు, సోషల్ మీడియా, యూట్యూబ్, వాట్సాప్‌ల్లో కావ్యకు వ్యతిరేక వార్తలు రాసిన, పోస్టులు పెట్టిన ప్రతాప్‌కుమార్ రెడ్డి అనుకూలంగా ఉండే కథనాలు ప్రచురించిన వారిని తీవ్రస్థాయిలో మా సంగతి తెలుసు కదా, ఒళ్లు దగ్గర పెట్టుకుని వార్తలు రాయండి అంటూ నేరుగా హెచ్చరిస్తుండడంతో టీడీపీ క్యాడరే వణికిపోతోంది. ఎక్కడ తమ గౌరవానికి భంగం ఏర్పడుతుందని పార్టీ కార్యక్రమాలకు దూరదూరంగా ఉంటున్నారు. ఆ పార్టీకి చెందిన ఓ నాయకుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు అయితే విలేకరులపై పత్రికల్లో రాయలేని భాషలో విరుచుకు పడుతూ విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కావ్య ప్రచారం మధ్యలోనే మలిశెట్టి వెళ్లిపోయాడంటూ కొన్ని పత్రికల్లో వార్తలు రావడంతో ఆ విషయాన్ని సమర్థించుకుంటూనే విలేకరులను హెచ్చరిస్తూ దారుణంగా మాట్లాడాడు. 'ఎందుకు వెళ్లి పోయానో నీకు చెప్పాలా..' అంటూ ఇంట్లోని తల్లులను కూడా కించపరిచేలా మాట్లాడడంపై పట్టణ ప్రజలు టీడీపీ నేతల వైఖరిని మండిపడుతున్నారు. రేపు ఓట్లు వేయకపోతే ఆడవాళ్లను కూడా ఇలానే మాట్లాడుతారని, ఇటువంటి నీచులకు బుద్ధి చెప్పాలని, ఆ పార్టీని వీడుతున్న కార్యకర్తలు, నేతలు బహిరంగంగానే పిలుపునిస్తున్నారు. మహిళలను, ప్రజలను కించి పర్చడం ఆపార్టీ అధిష్టానం నుంచి స్థానిక లీడర్ల వరకు రివాజుగా మారిందని మహిళలు మండిపడుతున్నారు.

ప్రశాంతత భగ్నం

కావలి నియోజకవర్గం ప్రశాంతతకు మారు పేరుగా ఉంది. రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యావంతులు అధికంగా ఉండే ప్రజలు హుందాతనాన్ని కోరుకుంటున్నారు. సున్నితమైన తీరప్రాంత గ్రామాల్లో సైతం ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు అత్యంత సంయమనంతో వ్యవహరిస్తుంటారు. అటువంటి కావలి నియోజకవర్గానికి వలస నేతగా వచ్చిన కావ్య కృష్ణారెడ్డి టీడీపీలోకి అడుగు పెట్టిన రోజు నుంచే ప్రశాంతతను భగ్నం చేస్తూ ప్రజల మధ్యకు వచ్చి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుండడంతో చర్చకు దారి తీసింది. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పుట్టి, పెరిగిన కావలి పాతూరుకే కాదు.. పదేళ్లుగా ఎమ్మెల్యేగా కావలి నియోజకవర్గ ప్రజలకు ఆయన వ్యక్తిత్వం, మనస్తత్వం ప్రజలకు తెలుసు. ప్రజాదరణ మెండుగా ఉన్న ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ప్రజాక్షేత్రంలో ఓడించడం కష్టమని తెలుసుకున్న కావ్య కృష్ణారెడ్డి వివాదాలకు ఆజ్యం పోసేలా అహంకారపూరిత వ్యాఖ్యలతో కొత్త తరహా రాజకీయానికి తెరతీశాడు. వైఎస్సార్‌సీపీ వర్గీయులను, తటస్థ ఓటర్లను రెచ్చగొట్టేలా ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇంటికి తాళాలు వేయిస్తానని ప్రగల్భాలు పలకడం, మీడియాను పెయిడ్ ఆర్టిస్టులుగా వర్ణించడం, కత్తులతో దాడులు అంటూ ఉన్మాద వ్యాఖ్యలతో రెచ్చగొట్టేలా కవ్వింపు చర్యలకు పాల్పడడంపై సొంత పార్టీ కార్యకర్తలు కూడా మండి పడుతున్నారు.

'సిద్ధం' సమరోత్సాహం


ఆత్మకూరు నుంచి సిద్ధం సభకు..


ఆత్మకూరు రూరల్: మహిమలూరు నుంచి..


ఏఎస్‌పేట: సిద్ధం సభకు బయలుదేరిన నాయకులు


చేజర్ల: పాతపాడు నుంచి..


సంగం: సిద్ధం సభకు బయలుదేరిన నాయకులు

- ఊరూరు నుంచి భారీగా తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగిన సిద్ధం మహాసభకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, సురేష్‌యాదవ్, కౌన్సిలర్లు కామాక్షయ్య నాయుడు, పి.పెంచలయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం సభకు తరలివెళ్లారు. మొత్తం 30 బస్సుల్లో పార్టీ అభిమానులు, కార్యకర్తలు సభకు వెళ్లగా మరో 70 కార్లు, తదితర వాహనాల్లో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్ రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్రతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పర్యవేక్షించారు.

అనుమసముద్రంపేటలో..

అనుమసముద్రంపేట: మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభకు ఏఎస్‌పేట మండలం నుంచి అనంతసాగరం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాపూరు వెంటసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో.. భారీగా నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు 30 బస్సులు, 20 కార్లలో బయలుదేరి వెళ్లారు.

చేజర్ల..

చేజర్ల: సిద్ధం సభకు మండలం నుంచి ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, జేసీఎస్ కన్వీనర్ పి బాలగంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు భారీ తరలి వెళ్లారు.

సంగం..

సంగం: మేదరమెట్లలో ఆదివారం జరిగిన సిద్ధం సభకు పార్టీ మండల అధ్యక్షుడు పులగం శంకర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలం నుంచి 38 బస్సులు, 20 కార్లలో నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు తరలివెళ్లారు. సభకు యువత, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా వెళ్లారు.

మర్రిపాడు..

మర్రిపాడు: సిద్ధం సభకు మర్రిపాడు మండలం నుంచి భారీ స్థాయిలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మర్రిపాడు మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, భీమవరం సొసైటీ అధ్యక్షుడు సోమల మాధవరెడ్డి, బూదవాడ సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితర నాయకుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు.

సోమశిల..

సోమశిల: అనంతసాగరం మండలం నుంచి మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివెళ్లారు. మండలం నుంచి 30 బస్సులు, ప్రత్యేక సొంత వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

అల్లూరు..

అల్లూరు: మేదరమెట్లలో జరిగిన 'సిద్ధం' సభకు మండలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, అల్లూరు టౌన్ కన్వీనరు దండా కృష్ణారెడ్డి, రూరల్ కన్వీనరు బీద రమేష్‌బాబు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కొండాపురం..

కొండాపురం: మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభకు కొండాపురం మండలం నుంచి పార్టీ మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ యారం నరసింహారావు, నాయకులు ఎడ్లపల్లి వెంకటరమణయ్య, మన్నం వెంకటసుబ్బయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తరలివెళ్లారు.

'సిద్ధం' సభకు భారీగా తరలిన శ్రేణులు

ఉదయగిరి: మేదరమెట్లలో ఆదివారం జరిగిన 'సిద్ధం' సభకు ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి 250 బస్సులు, వంద కార్లు, ఇతర వాహనాల ద్వారా తరలివెళ్లారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఈ సభకు స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో సిద్ధమైనప్పటికీ భద్రతా కారణాల దృష్ట్యా వారిని అనుమతించకపోవడంతో కొంత నిరాశగా వెనుదిరిగారు.

వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: మేదరమెట్లలో ఆదివారం జరిగిన సిద్ధం సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. బస్సులు, కార్లు, ఇతర ప్రైవేట్ వాహనాలను జమ్మలపాళెం వద్ద ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మర్రిపాడు: సిద్ధం సభకు..


సోమశిల: రేవూరు నుంచి..


అల్లూరు: జెండా ఊపి ప్రారంభిస్తున్న నాయకులు


కొండాపురం: కొమ్మి నుంచి తరలివెళుతున్న నాయకులు

సుస్థిరాభివృద్ధికి అడుగులు

- విజయసాయిరెడ్డి ఎంట్రీతో మారిన అంచనాలు
- కేంద్రంతో సత్సంబంధాల నేపథ్యంలో కావలికి అత్యధిక ప్రయోజనం
- బిట్రగుంటలో పట్టాలెక్కనున్న రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు?



బిట్రగుంట రైల్వేస్టేషన్

కావలి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి నియోజకవర్గం సుస్థిర అభివృద్ధి దిశగా అడుగులు వేసింది. రామాయపట్నం వద్ద పోర్టు, జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. దామవరం వద్ద విమానాశ్రయ నిర్మాణ ప్రతిపాదనలతో కావలి కనక పట్టణంగా మారబోతుంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి నెల్లూరు ఎంపీగా వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలబడుతుండటంతో కావలి ప్రాంతానికి మరింత మేలు చేకూరే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విజయసాయిరెడ్డికి కేంద్రంతో పాటు వివిధ కేంద్ర విభాగాల అధికారులతో సత్సంబంధాలు ఉండడంతో కావలి అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు. విజయసాయిరెడ్డి ఎంట్రీతో పార్టీలకు అతీతంగా అంచనాలు మారాయి. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కూడా వేగవంతం చేసేందుకు ఆస్కారం ఉంటుందని అంతా భావిస్తున్నారు. అపరిష్కృతంగా ఉన్న దామవరం విమానాశ్రయ ప్రతిపాదనలతో పాటు బిట్రగుంట వాసులు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న బిట్రగుంటలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు పూర్వవైభవం కూడా విజయసాయిరెడ్డితోనే సాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విజయసాయిరెడ్డి ఉన్నత విద్యావంతుడు కావడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు కావడంతో పాటు కేంద్ర వర్గాల్లో కూడా మంచి పట్టు ఉండటంతో పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలు ఎక్కే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

తొలి ప్రసంగంలోనే.. కావలిపై వరాల జల్లు

నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని ప్రకటించిన తర్వాత తొలి సారిగా ఆయన కావలిలో ఇటీవల కార్యకర్తలు, పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే కావలి ప్రగతికి సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలతో పాటు వరాల జల్లు కురిపించారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపించడం, సీఎం కూడా కావలి విషయంలో సానుకూలంగా వ్యవహరించడంతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో కావలికి అగ్రస్థానం లభించింది. నాలుగున్నరేళ్ల కాలంలో సుమారు రూ.1,400 కోట్లకు పైచిలుకు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల రూపంలో అందాయంటే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి కృషిని అర్థం చేసుకోవచ్చు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్ విషయంలో కూడా ఎమ్మెల్యే కృషి కావలి చరిత్రలో నిలిచిపోతుంది. ఎంపీ అభ్యర్థిగా వచ్చిన విజయసాయిరెడ్డి కావలికి మరిన్ని వరాలు ప్రకటించారు. కావలి పట్టణం నుంచి తీర ప్రాంత గ్రామాలకు రాకపోకలు సాగించే తుమ్మలపెంట రోడ్డు ఆధునికరణకు రూ.10 కోట్లు మంజూరు చేయించనున్నట్లు ప్రకటించారు. నిధుల మంజూరుతో పాటు త్వరితగతిన పనులు కూడా ప్రారంభించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పట్టణ చరిత్రను మలుపు తిప్పే ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి కూడా కేంద్ర రహదారుల శాఖతో చర్చించనున్నట్లు ప్రకటించారు. బిట్రగుంటలో నిరుపయోగంగా ఉన్న రైల్వే భూములను వినియోగంలోకి తీసుకువచ్చేలా ప్రాజెక్టుల ఏర్పాటుకు కూడా కేంద్ర రైల్వేశాఖతో చర్చించనున్నట్లు హామీ ఇచ్చారు. కావలి రైల్వేస్టేషన్ ఆధునికీకరణతో పాటు మరిన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు స్టాపింగ్ ఇప్పించే విషయం కూడా చర్చించనున్నట్లు ప్రకటించడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ వీరాభిమానులు సైతం వైఎస్సార్‌సీపీలోకి..

విజయసాయిరెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరుణంలో జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అందులో భాగంగా కావలి నియోజకవర్గంలో ప్రధానంగా టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి వీరవిధేయులుగా, వీరాభిమానులుగా ఉన్న నేతలందరూ వైఎస్సార్‌సీపీలో భాగస్వామ్యులు అవుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే చేస్తాడనే నమ్మకం ఉండడంతో, కావలి అభివృద్ధిని కాంక్షిస్తూ టీడీపీ సానుభూతిపరులు, తటస్థ ఓటర్లు కూడా వైఎస్సార్‌సీపీ వైపే చూస్తున్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

జలదంకి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జలదంకి జానకీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ఉదయం శుద్ధి, తోమాల, అర్చన తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు శాస్త్రోక్తంగా స్తపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం సీతారాముల గ్రామోత్సవం జరిగింది. ఉభయకర్తలు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పువ్వాడ వెంకటరమణయ్య–విజయలక్ష్మి, పువ్వాడ జగన్నాథకుమార్–లావణ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. సాయంత్రం తెప్పోత్సవం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

విశ్రాంత ఉద్యోగులకు ఘన సన్మానం


విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 75 ఏళ్లు నిండిన 13 మంది విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పుల్లయ్యాచారి భవనంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తమ సంఘం ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు ప్రధాన కార్యదర్శి, విశ్రాంత హెచ్‌ఎం జీవీ నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వి కృష్ణారెడ్డి, విశ్రాంత ఉద్యోగులు కేవీ శేషారెడ్డి, కె.లక్ష్మయ్య, ఎన్‌సీ పుల్లయ్య, డి నాగరత్నమ్మ, కరీమొహిద్దీన్, ఎంసీ రత్నం, సుబ్బయ్య, వెంకట రెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో పలు మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన మురుగును యంత్రాలతో తొలగించారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆదివారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పట్టణం శివారులో మురుగును తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జేఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లి, ప్రియదర్శినినగర్, వీవర్స్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో యంత్రాల సాయంతో పూడిక తీసిన పనులు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. పలు గృహాల యజమానులు సెప్టిక్ ట్యాంకులు నిర్మించుకోకుండా వ్యర్థాలను కాలువల్లోకి వెళ్లేలా పైపులు పెట్టారని, వారికి నోటీసులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన ఏఈ ప్రసాద్, ఆర్ ఖాసీం, ఈశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.